# భవిత మార్చిన బంగారు పిచ్చుక!



**చాలా మందికి 'పక్షులు' అంటే ఏదో సరదా వ్యాపకం. వాటిని కాసేపు చూస్తారు.. ఆనందపడతారు. కానీ మన దేశంలో పక్షిశాస్త్రం.. ఆర్నిథాలజీ(Ornithology)ని వృత్తిగా స్వీకరించి.. తన యావత్ జీవితాన్ని వాటికే అంకితం చేసి.. ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన స్వాప్నికుడు, భావకుడు 'ఇండియన్ బర్డ్ మాన్' సలీం అలీ!!**

సలీం అలీ పదేళ్ల వయసులో ఉండగా తనకు బహుమతిగా వచ్చిన ఒక 'ఎయిర్‌గన్'తో ఓ పిచ్చుకను కాల్చాడు. ఆ పిచ్చుక మెడ కింద బంగారు రంగులో ఒక సన్నని చార ఉంది. వింతగా ఉన్న దాన్ని చూసి ఆశ్చర్యపోయి, ఈ విషయాన్ని తన మేనమామకు చెప్పాడు. దాని గురించి ఆయనకు కూడా తెలియకపోవడంతో.. ఆ పిచ్చుకను ముంబయిలోని 'నేచురల్ హిస్టరీ సొసైటీ'లో పక్షులపై అధ్యయనం చేస్తున్న డబ్ల్యు. ఎస్.మిల్లర్డ్ వద్దకు తీసుకెళ్లారు. దాన్ని చూసిన మిల్లర్డ్ అది ఒక ప్రత్యేకమైన జాతికి చెందిన పక్షిగా చెప్పారు. ఇంకా ఆ సొసైటీలో 'స్టఫ్' చేసి పదిలపరిచిన అనేక రకాల అపురూపమైన పక్షులను చూపించారు. ఈ సంఘటన అలీ జీవితాన్ని అనూహ్యమైన మలుపు తిప్పింది. అప్పుడే, చిన్ననాడే పక్షులపై పరిశోధనలు చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.

## వృత్తి, ప్రవృత్తులు:

మేనమామ అమీరుద్దీన్‌త్యాబ్‌జీ చురుకైన 'షికారి' (వేటగాడు), ప్రకృతి ప్రేమికుడు. ఆయన పెంపకంలో పెరిగిన సలీం అలీ చిన్ననాటి నుంచే ప్రకృతిని ఆరాధించేవాడు. చదువు పూర్తయ్యాక ప్రకృతి శాస్త్రానికి సంబంధించిన ఏ ఉద్యోగం లభించక పోవడంతో.. భార్య తెహ్మీనాతో కలిసి 1919లో గనుల, కలప వ్యాపారం చేయడానికి బర్మాకు వలస వెళ్లారు. అక్కడ వ్యాపారంలో ఆశించిన ఫలితాలు పొందకపోయినా.. సలీం అలీకి ప్రకృతి ప్రేమికుడిగా బర్మా అరణ్యాలను పరిశీలించే అరుదైన అవకాశం లభించింది. వ్యాపారంలో నిలదొక్కుకోలేక పోవడంతో స్వదేశానికి తిరిగి వచ్చిన అలీ.. 'ఆర్నిథాలజిస్టు'గా 'జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా'లో ఉద్యోగం కోసం ప్రయత్నించారు. కానీ ఆయనకు ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ లాంటి డిగ్రీలు లేకపోవడంతో ఆ ఉద్యోగం రాలేదు. అప్పటికి ఆయనకున్న క్వాలిఫికేషన్ బీఎస్సీ డిగ్రీ మాత్రమే. దాంతో ఏదైనా ఉద్యోగంలో చేరి, పైచదువులు చదవాలని నిర్ణయించుకున్నారు. ముంబయిలోని 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియం'లో అప్పుడే కొత్తగా ప్రారంభించిన నేచురల్ హిస్టరీ విభాగంలో 'గైడ్' లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరారు.

## దృష్టంతా 'ఆర్నిథాలజీ' పైనే:

పక్షి శాస్త్ర పరిశోధనను జీవితాశయంగా మలచుకోవాలంటే.. ఉన్నత చదువులు అవసరమని సలీం అలీ గుర్తించారు. తన ఉద్యోగానికి సెలవు పెట్టి, జర్మనీలోని బెర్లిన్‌కి వెళ్లి ప్రఖ్యాత పక్షి శాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్

స్ట్రైస్ మాన్ వద్ద ఆ శాస్త్రంలో శిక్షణ పొందారు. అంత కష్టపడి ఉన్నతమైన శిక్షణ పొందినా... ఆయనకు ఆ శాస్త్ర పరిశోధనలో తగిన పదవి లభించలేదు. దీంతో సలీం ఆలీ పక్షుల పరిశోధనలో ఒక దేశదిమ్మరిగా మారడానికే నిర్ణయించుకున్నారు. బెర్లిన్‌లో నిరాశకు గురైన ఆయన 1930లో ఇండియాకు తిరిగి వచ్చారు. కానీ ఇక్కడ.. ఉన్న ఉద్యోగం కూడా పోవడంతో ముంబయి తీరప్రాంతంలో ఉన్న 'కిహిమ్' గ్రామానికి వెళ్లి పక్షుల పరిశోధనలకే తన జీవితాన్ని అంకితం చేయాలనే దృఢసంకల్పానికి వచ్చారు. మొట్టమొదటగా 'బేయావీవర్' అనే పక్షిపై పరిశీలన చేయడం ప్రారంభించారు. ఆ పక్షిని గురించి కనుగొన్న వివరాలు పక్షిశాస్త్ర రంగంలో ఆయనకు ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. తర్వాత రోజుల్లో ఆయన రాజ సంస్థానాధీశుల పాలనలో ఉన్న హైదరాబాద్, తిరువాన్కూరు, గ్వాలియర్, కొచ్చిన్, ఇండోర్ లాంటి ప్రాంతాలలోని పక్షులపై అనేక పరిశోధనలు చేసి.. వాటిని గ్రంథ రూపంలో ప్రచురించారు. ఆ పరిశోధనల్లో భాగంగానే ఆయన అప్పటికే కనుమరుగైన గిజిగాడు (వీవర్) జాతికి సంబంధించిన 'ఫిన్స్‌బోయా' అనే పక్షిని 'కుమాన్‌డె రాయ్' ప్రాంతంలో తిరిగి గుర్తించారు.

## పక్షుల వేటకు వ్యతిరేకి:

'పక్షులపై నా శ్రద్ధాసక్తులు... ప్రకృతిలోని సహజ సిద్ధమైన పరిసరాల్లో వాటి స్వాభావిక జీవనాన్ని అధ్యయనం చేయడమే. అంతేకాని, వాటిని ఏ ప్రయోగశాలకో పట్టుకు వచ్చి, మైక్రోస్కోపుల కింద పరిశీలించాలని మాత్రం కాదు. మానవ సంచారం లేని మారుమూల ప్రాంతాలలో వాటి సహజమైన నివాసాలలో అవి ఎలా జీవిస్తున్నాయో.. ప్రవర్తిస్తున్నాయో అధ్యయనం చేయాలనే నా అభిలాష. పక్షుల వేటను నేను అతి విధ్వంసక చర్యగా భావిస్తాను. ఈ చర్యను అతి తీవ్రంగా ఖండించాలి. పక్షులపై నా ప్రేమ ఏదో అభిమాన పూర్వకమైన భావోద్వేగం కాదు. అది ముఖ్యంగా సౌందర్యోపాసనకు, శాస్త్ర విజ్ఞానానికి, కార్యసాధనకు సంబంధించింది' అని అంటారు సలీం అలీ!

## మూతపడనున్న సంస్థలకు వెన్నుదన్నుగా:

తగినన్ని నిధులు లేకపోవడంతో.. 200 ఏళ్ల చరిత్ర గల బొంబాయి నేచురల్ హిస్టరీ సొసైటీ (BNHS) మూతపడనున్న సమయంలో... సలీం అలీ, అప్పటి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను సంప్రదించి, కావలసిన ఆర్థిక వనరులు సమకూర్చి ఆ సంస్థను పునరుద్ధరించారు. ఆ సంస్థలోని 'స్టఫ్' పక్షులను చూసే ఆయన పక్షుల పరిశీలనలపై మక్కువ పెంచుకున్నారు. ఆయన పలుకుబడి భరత్‌పూర్ బర్డ్ శాంక్చ్యురీని, సైలెంట్ వ్యాలీ నేషనల్ పార్కును మూత పడకుండా కాపాడింది. 1990లో 'సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ' (SACON) ఆయన స్మారకార్థం కోయంబత్తూర్ సమీపంలో 'అనైకట్టీ'లో భారత ప్రభుత్వం స్థాపించింది. సలీం ఆలీ 1987లో, తన 92వ ఏట మరణించినా... ఆయన కీర్తి మాత్రం ఈ లోకంలో పక్షి సంతతి ఉన్నంతవరకు నిలిచిపోతుంది!!